క్లుప్తంగా

గోశాలకు రూ.10 వేల విరాళం



బాబి సమకూర్చిన రూ.10 వేల విరాళాన్ని గోశాల ప్రతినిధులకు అందజేస్తున్న రుద్రరాజు

అమలాపురం టౌన్: స్థానిక గౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాలకు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వంటెద్దు బాబి తన పుట్టినరోజు సందర్భంగా రూ.10 వేల విరాళం సమకూర్చారు. ఈ విరాళాన్ని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చేతుల మీదుగా గోశాల ప్రతినిధులు కేవీ మావుళ్లయ్య, ఎ.మల్లిబాబులకు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, జిల్లా పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో హోమం జరిపిస్తున్న పండితులు

ఐ.పోలవరం: శ్రావణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పండితులు తొలుత గణపతి పూజ, మండపారాధన, అనంతరం చండీ హోమం, పూర్ణాహుతి జరిపారు. 105 మంది భక్తులు చండీ హోమంలో పాల్గొన్నారు. ప్రతి నెలా పౌర్ణమి తిథికి భక్తుల గోత్రనామాలతో దేవస్థానం తరపున చండీ హోమం నిర్వహిస్తున్నారు. సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆకొండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

22న అమలాపురంలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: ఈ నెల 22వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీలో పనిచేయుటకు జాబ్ మేళా జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14,500 నుంచి రూ.22,000 వరకూ జీతం ఇస్తారన్నారు. ఆసక్తి గల వారు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ పత్రాలతో జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 81218 38392 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


ముత్యాలమ్మకు క్షీరాభిషేకం




పి.మల్లవరంలో ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి పవిత్ర శ్రావణమాసం రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కాకినాడకు చెందిన విళ్ల వెంకటేశ్వరరావు, నాగమణి దంపతులచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అనంతరం క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ధూళిపూడి సుబ్బారావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, నాగవెంకట సతీష్‌కుమార్, లక్ష్మీ సూర్య భవాని, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పీజీసీయూఈటీలో విద్యార్థినుల ప్రతిభ



మల్లాడి మౌనిక



విజయ



సువర్ణ గ్రేస్

యానాం: దేశవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పోస్టు గ్రాడ్యుయేషన్ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(పీజీసీయూఈటీ)లో యానాం ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి మెరుగైన స్కోరు సాధించారని ప్రిన్సిపాల్ వరుగు భాస్కర రెడ్డి, ఫిజిక్స్ హెచ్ఓడీ ఎస్.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మల్లాడి మౌనిక, బీర విజయ, బీర సువర్ణగ్రేస్ మెరుగైన స్కోరు సాధించి పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫిజిక్స్‌లో ప్రవేశం పొందారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

కరిచాయో కష్టమే



గ్రామాల్లో పేట్రేగిపోతున్న వీధి కుక్కలు



డెర్మటైటీస్ వ్యాధి సోకిన కుక్క

- వీధి కుక్కల్లో విస్తరిస్తున్న డెర్మటైటీస్ వ్యాధి
- ఈ వ్యాధి సోకిన కుక్కలు కరిస్తే రేబిస్ సోకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న పశు వైద్యులు

అల్లవరం: కుక్క విశ్వాసానికి ప్రతీక. అలాంటి కుక్కలు ఇప్పుడు ప్రజా జీవితానికి పెను ప్రమాదంగా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయి. ఎలాంటి నియంత్రణ చర్యలు లేకుండా పోవడంతో వీటి సంఖ్య నానాటికీ పెరుగుతూ వస్తోంది.

అయితే వీధి కుక్కల్లో విస్తరిస్తున్న డెర్మటైటీస్ వ్యాధి కారణంగా మరో ప్రమాదం పొంచి ఉందని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చాప కింద నీరులా విస్తరిస్తున్న వ్యాధి

ప్రస్తుతం గ్రామగ్రామాన వందలాదిగా పెరిగిపోయిన కుక్కల్లో డెర్మటైటీస్ వ్యాధి ఎక్కువగా ఉన్నట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యాధి చాప కింద నీరులా వ్యాపిస్తుందని, ప్రజలంతా కుక్కల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. డెర్మటైటీస్ వ్యాధితో బాధపడుతున్న కుక్కలకు చర్మంపై వెంట్రుకలు పూర్తిగా ఊడిపోతాయి. రక్తం, చీము పొక్కులతో చర్మం మందంగా మారి అంధవికారంగా కనిపిస్తాయి. ఈ వ్యాధి సోకిన కుక్కలు వీధుల్లో తిరిగితే పశు సంపదపై సైతం తీవ్ర ప్రభావం చూపుతుందని పశు వైద్యులు చెబుతున్నారు. డెర్మటైటీస్ వ్యాధి సోకిన కుక్క జంతువుల్ని కరిస్తే జంతువులు సొంగ కార్చడం, డొక్కలు లోపలకి నొక్కుకుని పోవడం, మేత సరిగా తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో వైద్యం అందకపోతే ఆయా పశువులు చనిపోయే అవకాశం ఉంది. అంతేకాకుండా అవే కుక్కలు మనుషులను కరిస్తే రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది.

వ్యాక్సిన్ వేయని వీధి కుక్కలు కరవడం వల్ల రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అందుకే డెర్మటైటీస్ వ్యాధి సోకిన వీధి కుక్కల విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు.

లోపం ఎక్కడుంది?

గ్రామాల్లో నిత్యం పెరుగుపోతున్న వీధి కుక్కలను నియంత్రించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. వీధి కుక్కల సంఖ్య పెరగకుండా వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయవలసి ఉంది. అయితే ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నది బహిరంగ రహస్యమే. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నియంత్రణలో చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త



డెర్మటైటీస్ వ్యాధి సోకిన కుక్కలతో ప్రమాదం పొంచి ఉంది. గ్రామాల్లో తిరిగే ఈ కుక్కలకు జీవులు, పశువుల్ని దూరంగా ఉంచాలి. వీటికి రేబిస్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పశువుల్ని డెర్మటైటీస్ వ్యాధి సోకిన కుక్కలు కరిస్తే వెంటనే పశు వైద్యాధికారిని సంప్రదించి చికిత్స అందించాలి.

– ఎం.నారాయణరావు, పశు వైద్యాధికారి, అల్లవరం

బోధన మరింత మెరుగవ్వాలి



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న సర్వ శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మధుసూదనరావు

అమలాపురం టౌన్: తరగతుల్లో విద్యా బోధన మరింత మెరుగయ్యేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వి.విజయకుమారి అధ్యక్షతన సోమవారం జరిగిన ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృత్తి నైపుణ్యాలు పెంచుకుంటూ బోధనలో నూతన విధానాలను ప్రవేశపెట్టేలా ఈ శిక్షణా తరగతులు మెరుగైన ఫలితాలు ఇస్తాయని ఆయన ఆకాంక్షించారు. టీచ్ టూల్‌పై ప్రతి ఉపాధ్యాయుడు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన పరికరాలతో సాయంతో బోధన సాగాలన్నారు. పాఠశాల విద్యను బలోపేతం చేసే దిశగా ఉన్నత పాఠశాలల్లో విద్య బోధించే ఉపాధ్యాయులకు ఇక నుంచి ప్రతి నెలా రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



వానపల్లిపాలెంలో ఈశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్నేహితులు

ఉప్పలగుప్తం: తమతో కలిసి చదువుకున్న మిత్రుడు ఆకస్మికంగా మృతి చెందడంతో చిన్ననాటి స్నేహితులంతా కలిసి అతడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09లో పదో తరగతి చదువుకున్న మండలంలోని వానపల్లిపాలేనికి చెందిన దోనిపాటి ఈశ్వరరావు(30) ఈ నెల 4న బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులంతా రూ.25 వేలు సమకూర్చి సోమవారం ఈశ్వరరావు ఇంటికి వెళ్లి అతడి కుటుంబసభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఈశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెయ్యల సుభాష్ చంద్రబోస్, పరమట రాజేష్, నిమ్మితి రాజు, మధుర రాజేష్, పెయ్యల కల్యాణ్‌బాబు, మెండి నాని తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌కు సహకరించాలి



చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాతాజీకి వినతిపత్రం ఇస్తున్న మాల మహానాడు నాయకులు



సమావేశంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా ఈ నెల 21న నిర్వహించనున్న భారత్ బంద్‌కు సహకరించాలని అమలాపురం పట్టణ చాంబర్స్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార ప్రతినిధులను మాల మహానాడు నాయకులు అభ్యర్థించారు. పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, మరో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్‌లను మాలమహానాడు నాయకులు సోమవారం వేర్వేరుగా కలిసి 21న బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తూ దుకాణాలు మూసి వేసి సహకరించాలని కోరుతూ వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏకే భీమారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉండ్రు బాబ్జి, రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, ఊటాల వెంకటేష్, జల్లి శ్రీనివాసరావు, బొంతు రమణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఈ నెల 21న చేపట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మండల మాల మహానాడు జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. జేఏసీ కార్యకర్తలు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు, విద్యాసంస్థలు సహకరించాలని వారు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

తాళ్లరేవు: ఎస్సీ, ఎస్టీల వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన చేపట్టిన భారత్ బంద్‌కు మద్దతుగా తాళ్లరేవు మండలంలో నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద పలు సంఘాల నాయకులు సమావేశమై సంపూర్ణ మద్దతు పలికారు. బుధవారం నిర్వహించే బంద్‌కు ప్రజలతో పాటు అన్ని సంఘాల నాయకులు, వర్తక సంఘం ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో సబ్బతి శ్రీను, వాకపల్లి చిట్టిబాబు, అంబేడ్కర్, మేడపాటి దేవానంద్, దడాల బుజ్జిబాబు, జక్కల ప్రసాద్, కాశి లక్ష్మణస్వామి, మోర్త భైరవస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారిలు



మాజీ మంత్రి విశ్వరూప్‌కు రాఖీ కడుతున్న బీకే శ్రీదేవి



మల్లాడికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

అమలాపురం రూరల్: రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌కు అమలాపురం ఓం శాంతి బ్రహ్మకుమారిలు సోమవారం రాఖీ కట్టారు. అమలాపురం మండలం భట్నవిల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయానికి వెళ్లి మాజీ మంత్రి విశ్వరూప్‌కు ఓంశాంతి బ్రహ్మకుమారి ఇన్‌చార్జి బీకే శ్రీదేవి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వరూప్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా రాఖీ వేడుక

ముమ్మిడివరం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆప్యాయతకు అనురాగాలకు ప్రతీక అయిన రాఖీ పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రక్షాబంధన్ కట్టి శుభాకాంక్షలు తెలిపి వారి నుంచి ఆశీస్సులు తీసుకున్నారు.

యానాం: రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, విద్యుత్ శాఖ ఈఈ, పోలీస్‌శాఖలో ఎస్ఐ, పోలీసు సిబ్బందికి, కోర్టు, మున్సిపల్ సిబ్బందికి బ్రహ్మకుమారీలు సోమవారం రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు దుర్గ, లక్ష్మి, బ్రహ్మకుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఆత్మీయతా అనురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని అన్నాచెల్లెళ్లు ఘనంగా నిర్వహించుకున్నారు. మురముళ్ల వీరేశ్వరస్వామి ఆలయ అర్చకులు యనమండ్ర సత్యసీతారామశర్మకు ఆరుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. వారంతా రాఖీ పండగ కోసం హైదరాబాద్, వైజాగ్, బెంగుళూరు తదితర దూరప్రాంతాల నుంచి వచ్చి ఆయనకు రాఖీ కట్టి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.



యనమండ్ర సత్యసీతారామశర్మకి ఆరుగురు అక్కాచెల్లెళ్లు రాఖీ కడుతున్న దృశ్యం



ముమ్మిడివరంలో తమ సోదరులకు రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు

పురవీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ



అమలాపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు




విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న జిప్‌మెర్ వైద్యులు

అమలాపురం టౌన్: కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ ఇంజినీరింగ్ విద్యార్థులు సోమవారం రాత్రి అమలాపురం పట్టణ వీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక గడియారం స్తంభం సెంటర్ నుంచి కిమ్స్ మెడికల్ కాలేజీ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ సాగింది. మహిళా డాక్టర్‌పై అటవికంగా లైంగిక దాడి చేసి ఆపై కిరాతంగా హత్య చేసిన దోషులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు యల్లమిల్లి నాగ సుధాకొండ, దంగేటి రమణ తదితరులు పాల్గొన్నారు.


జిప్‌మెర్ వైద్యుల నిరసన

యానాం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ యానాం జిప్‌మెర్ వైద్యులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులను తక్షణం అరెస్ట్ చేసి ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.నరేష్, ఆదిత్య భట్టాచార్య, గైనకాలజిస్ట్ బికాష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



గొల్లవిల్లిలో లూయిస్ డాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు



అమలాపురంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఫొటోగ్రాఫర్లు



ఐ.పోలవరంలో లూయిస్ డాగూరే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



ముమ్మిడివరంలో ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఫొటోగ్రాఫర్లు

ఉప్పలగుప్తం: ది లూయిస్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గొల్లవిల్లిలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి చోడిశెట్టి ఆదినారాయణ, బొక్కా పుల్లంశెట్టి, మట్టపర్తి సురేష్, దేవదాసు రాజేష్‌కుమార్, దేవరపల్లి శ్రీనివాసరావు, మోసిగంటి ప్రసాద్, జంగా రవికుమార్, అంబటి వెంకటేశ్వరరావు, దోనిపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో 185వ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రఫీ డే కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ తరాలు మారుతున్నా, ఎంత ఆధునీకత, సాంకేతికత అందుబాటులోకి వచ్చినా ఫొటోలకు ఉన్న ప్రాధాన్యత తగ్గదన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్, యూనియన్ ప్రతినిధులు ధనరాజు, ఖ్వాజాబాబు, తాతాజీ, రమణ, నగేష్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండల పరిధిలోని ఫొటోగ్రాఫర్లు ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను గుర్తించి చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్టుగా రాయితీలు, రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు నంబూ సత్యనారాయణ, పీవీఎస్ఎన్ రాజు, వి.సురేష్, కె.గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విష్ణాలయం సెంటర్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు చప్పిడి రాజేష్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కరిగిపోయే కాలంలో జ్ఞాపకాలను అంతరించిపోకుండా సజీవ రూపంలో ఉంచేది ఒక్క ఫొటో మాత్రమేనన్నారు. కార్యక్రమంలో కాకి మాణిక్యం, చింత వెంకటేష్, గుత్తుల నాగు, కముజు శ్రీనివాసరావు, గాలిదేవర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న ఎంపీహెచ్ఏఎఫ్ విజయనిర్మల

అమలాపురం రూరల్: అమలాపురం మున్సిపల్ కాలనీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సందర్భంగా కోనసీమ గ్రామాల నుంచి వచ్చే ప్రజల సౌకర్యార్థం శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏఎఫ్ ఐ.విజయనిర్మల, ఆశా కార్యకర్తలు భువనేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలోని నాన్ స్టాఫ్ సెంటర్లో పూర్తి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిక అధికారి డాక్టర్ ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్, కేస్ వర్కర్, పారా లీగల్ పర్సనల్, పారా మెడికల్ ఫార్మసీ, సైకో సోషల్ కౌన్సిలర్, ఆఫీస్ అసిస్టెంట్, సెక్యూరిటీ గార్డ్ తదితర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. 25 ఏళ్ల నుంచి 42 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 30వ తేదీలోగా ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న తమ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు.

నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపిక పోటీలు

యానాం: నేషనల్ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, హాకీ, ఫుట్‌బాల్, షటిల్, వాలీబాల్, చెస్, హ్యాండ్‌బాల్ తదితర క్రీడల్లో ఎంపిక పోటీలను నిర్వహించారు. పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు ప్రతిభను చాటారు. ఎంపిక పోటీల్లో విజయం సాధించిన వారు ఈ నెల 29న పుదుచ్చేరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వినకోటి సన్యాసిరావు, పీఈటీలు పాము సత్యనారాయణ, భాస్కర్, మోహన్, చంద్రశేఖర్, వరప్రసాద్, సుబ్బన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు రివిజన్ కార్యక్రమాలు

యానాం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకూ రెండు దశల్లో ప్రీ ఓటరు రివిజన్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎన్నికల శాఖ అధికారులు సోమవారం తెలిపారు. స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ హాలులో బీఎల్ఓ, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మొదటి దశలో సంబంధిత బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాల వెరిఫికేషన్, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, బ్లర్ అయిన ఫొటోల స్థానంలో నాణ్యత గల ఫొటో ఓటరు ఐడీ, ఫార్మెట్ 1 నుంచి 8 వరకూ సిద్ధం చేయడం, ఫిర్యాదుల నమోదు చేపడతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ సందిర కుమరన్, తిరుకోటి అర్జునరావు, సాధనాల బాబు తదితరులు పాల్గొన్నారు.